రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# రెండో విడత ఇందిరమ్మ కోటాకు వెరిఫికేషన్

## కలెక్టర్ దీపక్ తివారి ఆదేశం

**వికారాబాద్, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సంబంధిత అధి కారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, లబ్ధిదారులకు అందుతున్న ప్రభుత్వ సహాయం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారి హౌసింగ్ అధికారులు, ఎంపీడీఓలతో జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లకు గజిటెడ్ ఆఫీసర్స్ ద్వార వెరిఫికేషన్ పూర్తి చేసి సబ్మిట్ చేయాలని ఎంపీడీఓ లకు ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న లబ్ధిదారుల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షి ంచాలని ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులకు సూచిం చారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని నిరంతరం పర్యవేక్షి స్తూ, లక్ష్యాలను



మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారి

నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకం ద్వారా ప్రయోజనం అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, హౌసింగ్ శాఖ పిడి మాతృనాయక్, డిప్యూటీ ఇ.ఇ ముక్రం బాబా తదితరులు పాల్గొన్నారు.

---

### నారపల్లిలో

# గుప్పుమన్న గంజాయి

## 285 గ్రాముల ప్యాకెట్లు స్వాధీనం



ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన నిందితులు

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** గంజాయి ప్యాకెట్లను నిల్వ ఉంచుకున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 285 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నారపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం.. మల్కాజ్‌గిరి ఎన్‌ఫోర్స్‌మెంటు టీం ట్రైనింగ్ ఎస్సై. ఎస్. ముస్తాఫా సిద్ధిక్ పోలీస్ సిబ్బందితో కలిసి ఘట్‌కేసర్ మండలం నారపల్లిలోని సాయి టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న షంషేర్ అలీఖాన్, మహమ్మద్ ఇర్ఫాన్‌ల >>2

---

### వింత రాజకీయం

# ఎల్లంపేటను ఏలుతున్నదెవరు?

**చైర్మన్ ప్రమేయం లేకుండానే కీలక నిర్ణయాలు**

**మున్సిపాల్టీలో కూటమి మార్క్‌కు కాంగ్రెస్ చెక్**

**కాగితాలకే పరిమితమైన బిఆర్ఎస్-బిజెపి ఒప్పందం**

**అధికారపార్టీ నేతల గుప్పెట్లో అధికారులు?**

- అధికారులకు పాలకవర్గానికి మధ్య లోపించిన సమన్వయం
- పాలన కుంటుబడుతుందని స్థానికుల ఆవేదన
- గులాబీ నీడలో కమలం కౌన్సిలర్లు
- బిజెపి క్యాడర్‌లో పెరుగుతున్న అసంతృప్తి

**నామమాత్రంగా చైర్మన్‌గిరి!**





**మేడ్చల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ఎల్లంపేట మున్సిపాలిటీలో చైర్మన్, కమిషనర్ల మధ్య సయోధ్య కుదరకపోవడంతో పాలన పూర్తిగా గందరగోళంగా తయారైందనే చర్చ స్థానికంగా తీవ్రంగా సాగుతోంది. చైర్మన్ ఇచ్చే సూచనలకు, ఆదేశాలకు కమిషనర్ అసలు ప్రాధాన్యమివ్వడం లేదని మున్సిపల్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తుండగా, కమిషనర్ మాత్రం అధికార కాంగ్రెస్ నాయకుల సూచనలకే అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. ఈ రాజకీయ, పరిపాలనా ఘర్షణల మధ్య చివరకు సామాన్య ప్రజలే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మున్సిపాలిటీలోని మొత్తం 24 మంది కౌన్సిలర్లలో బీఆర్ఎస్‌కు 12, కాంగ్రెస్‌కు 8, బీజేపీకి 4 మంది బలముంది. ఎన్నికల అనంతరం ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో ఏర్పడిన బీఆర్ఎస్–బీజేపీ ఒప్పందంతో బీఆర్ఎస్ చైర్మన్, బీజేపీ వైస్ చైర్మన్ పదవులను దక్కించుకున్నాయి. పదవుల పరంగా బీఆర్ఎస్–బీజేపీ కూటమి మున్సిపాలిటీని నడిపిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పరిపాలనా వ్యవహారాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్ల ప్రభావమే కొనసాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఒక గోదాము నిర్మాణంపై చెలరేగిన వివాదమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. అధికార పార్టీ ఎమ్మెల్యే అండదండలతో నిబంధనలకు విరుద్ధంగా గోదాము నిర్మిస్తున్నారని విమర్శలు రావడంతో అధికారులు దాన్ని సీజ్ చేసినప్పటికీ, ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లతో నెల తిరగకుండానే పనులు యథాతథంగా ప్రారంభమయ్యాయి. ఈ ఘటనే చైర్మన్-కమిషనర్ల మధ్య వైరాన్ని మరింత పెంచినట్లు తెలుస్తోంది. గతంలో తమ సామాజిక వర్గానికి చెందిన కమిషనర్ ఉన్నంతకాలం పాలన సాఫీగా సాగినా, ప్రస్తుత కమిషనర్ కృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చైర్మన్‌తో సయోధ్య లోపించింది. చైర్మన్‌కు సమాచారం లేకుండానే నిర్ణయాలు జరగడం, ఇటీవల బిల్ కలెక్టర్ల బదిలీల వ్యవహారంలో సమన్వయం లేకపోవడం వంటి పరిణామాలు అధికారుల తీరుపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. అధికారులు ప్రజాప్రతినిధుల మాట వింటున్నారా లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు, బీజేపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు సొంత పార్టీ కార్యక్రమాలను పక్కనపెట్టి బీఆర్ఎస్ నాయకులతోనే కలిసి తిరుగుతున్నారంటూ ఆ పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతుండగా, తాము కేవలం అధికారిక మున్సిపల్ కార్యక్రమాల కోసమే కలిసి వెళ్తున్నామని వారు వివరణ ఇస్తున్నారు. అధికార మార్పిడి, రాజకీయ ఆధిపత్య పోరు పక్కన పెడితే సమర్థవంతమైన పాలన, సమస్యల పరిష్కారమే తమకు >>2

---

# ఖరీఫ్ కొనుగోళ్లపై ఫోకస్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాబోయే ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రైతుల సంక్షేమ చర్యలపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ మను చౌదరి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, క్షేత్రస్థాయి సిబ్బంది త్వరలోనే 70 శాతం లక్ష్యాన్ని దాటేలా చూడాలని ఆదేశించారు. కొనుగోళ్ల వేళ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ప్రతి మండలంలో కనీసం ఒక కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, ధాన్యం నిల్వల రవాణాలో ఆలస్యం కాకుండా ప్రత్యామ్నాయ గోదాములు, అదనపు నిల్వ స్థలాలను ముందే గుర్తించాలని సూచించారు.

**ధాన్యం సేకరణకు ముమ్మర సన్నాహాలు**

**మండలానికో కొనుగోలు కేంద్రం**

**మౌలిక వసతులు, రవాణా, అన్‌లోడింగ్‌లో సమన్వయం**

**ఫార్మర్ రిజిస్ట్రీ లక్ష్యం 70 శాతం దాటాలి**

**అధికారులకు కలెక్టర్ మనుచౌదరి ఆదేశం**

**గన్నీ బ్యాగుల కొరత రాకూడదు**

అన్ని కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, టార్పాలిన్ షీట్లు, తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు, ఆటోమేటిక్ క్లీనింగ్ మిషన్లు సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యాన్ని గోదాములకు తరలించేందుకు తగినన్ని వాహనాలు సిద్ధం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

**ధాన్యం ఆరబోసేందుకు ఖాళీ స్థలాలు ఎంపిక చేయండి**

అన్‌లోడింగ్ పాయింట్ల వద్ద ట్రాఫిక్, కూలీల కొరత రాకుండా గోదాముల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ధాన్యం ఆరబోసేందుకు వీలుగా తహసీల్దార్లతో మాట్లాడి సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఖాళీ స్థలాలను పరిశీలించాలన్నారు.

**రైతుల సమస్యలు ఓపికగా వినండి**

అకాల వర్షాల నుంచి పంటను కాపాడేందుకు వాతావరణ హెచ్చరికలను >>2

---

# మంచితనాన్ని చేతగాని తనంగా తీసుకోకండి

## ప్రజాసేవకు అంకితమై పనిచేస్తున్నాం

## లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదు

## ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

**తాండూరు, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** గత కొన్ని సంవత్సరాలుగా ప్రజా సేవకు అంకితమై పనిచేస్తున్నామని.. అనవసర రాజకీయాల్లోకి తన పేరును లాగవద్దని.. లేనిపోని ఆరోపణలు చేస్తే ఖబడ్దార్ అంటూ ఆర్బీఓఎల్ సీఈఓ, తాండూరు కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరిం చారు. మంగళవారం తాండూరులోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీని వాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తను గత కొన్ని సంవత్సరాలుగా వ్యాపార రంగంతో పాటు ప్రజా సేవలో ఉన్నానని తెలిపారు. కొందరు రాజకీయపబ్బం గడుపుకొనేందుకు తనపై కావాలనే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తనపై కక్ష్యపూరితంగా ఆరోప ణలు చేసినా మంచితనంతో సహనంగా ఉండి వారి విజ్ఞతకే వదిలేశానని తెలిపారు. అయినా కొందరు తనపై షాడో ఎమ్మెల్యే అంటూ.. ఇసుక, ఎర్రమట్టి >>2

---

# ఎరువులు ఇవ్వకుంటే పంటల గతేంటి?

**తీసుకున్న రుణాలను చెల్లించేది ఎలా !**

**అసైన్డ్ భూములపై గతంలో రుణాలు ఇచ్చారు**

**ఇప్పుడు ఎందుకు నిరాకరిస్తున్నారు?**

**పెద్దేముల్ పిఏసిఎస్ సర్వసభ్య సమావేశంలో రైతుల ఆగ్రహం**





ఎరువుల కోసం అధికారులను నిలదీస్తున్న రైతు

**పెద్దేముల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** సొసైటిలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సంబందిత అధికారులు పదేపదే చెబుతున్నప్పటికి, పంటలు పండించేందుకు అవసరమైన ఎరువులు సరఫరా సక్రమంగా చేయకపోతే తాము రుణాలు ఎలా చెల్లించగలమని రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. మంగళవారం పెద్దేముల్ ఎప్ఎస్‌సిఎస్‌లో చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్ విధానం కారణంగా యూరియ, ఇతర ఎరువులు పొందడంలో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని అన్నారు. పంటలు పండాలంటే ఎరువులు కావాలి, ఎరువులు అందకపోతే పంటలు ఎలా పండుతాయి, పంట పండక ఆదాయం రాకపోతే సొసైటి రుణాలు ఎలా చెల్లించాలని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ భూములపై రుణాలు అందించనప్పుడు ఎలాంటి అభ్యంతరం లేకుండా రుణాలు మంజూరు చేశారని, ప్రస్తుతం అదే భూములపై రుణాలు ఇవ్వడానికి నిరాకరించడం ఎందుకని ప్రశ్నించారు.

గతంలో రుణాలు ఇచ్చినప్పుడు ప్రభుత్వ భూములన్న విషయం తెలియదా, ఇప్పుడు మాత్రమే ఆ విషయం ఎందుకు గుర్తొచ్చిందని ఆందోళన వ్యక్తంచేశారు. అసైన్డ్ భూములపై రుణాలు నిరాకరించడానికి గల కారణాలను స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న రైతుకు నిబంధనల ప్రకారం రుణ సదుపాయం కల్పించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.

---



ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన చిరువ్యాపారులు, బిజెపి నాయకులు

# మా పొట్టకొట్టకండి సార్

**ఏళ్ల తరబడి కష్టపడ్డాం..**

**ఒక్కసారిగా రోడ్డుపైకి ఈడ్చద్దు**

**ప్రత్యామ్నాయం చూపాల్సిందే**

**ఆమన్‌గల్‌లో చిరువ్యాపారుల ఆక్రోశం**

**ఆమనగల్లు, సెప్టెంబరు29, ప్రభాతవార్త:** దశాబ్ద కాలంగా ఎండనక, వాననక పందిళ్ల కింద వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించు కుంటున్న తమ పొట్ట కొట్టారని ఆమన్‌గల్ చిరువ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నోటీస్ లేదు, మాట లేదు.. కనీసం ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా, విద్యుత్ మీటర్లను సైతం పీకేసి దౌర్జన్యంగా డబ్బాలను తొలగించడంతో వందలాది కుటుంబాలు వీధిన పడ్డాయి. బతుకుదెరువు కోల్పోయి అనాథల్లా మారిన బాధితులకు తోడై బిజెపి నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అధికారుల తీరుపై మండిపడ్డారు. తక్షణమే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి తమకు ఉపాధి మార్గం చూపాలని, లేకపోతే అక్టోబర్ 5 నుంచి 7 వరకు దీక్షలతో పాటు రహదారి దిగ్బంధం చేస్తామని తీవ్ర ఆవేదన, ఆగ్రహంతో హెచ్చరించారు. వివరాలలోకి వెళితే.. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి అనుసంధానంగా ఉన్న చిరువ్యాపారుల డబ్బాల తొలగింపు చర్యతో స్థానిక బిజెపి నేతలను ఆగ్రహానికి గురి చేసింది. దశాబ్దాల తరబడిగా డబ్బాలు వేసుకుని జీవనోపాధి పొందుతున్న వారిని ఒక్కసారిగా రోడ్డు పాలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తూ మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో బాధితులతో కలిసి ధర్నాకు దిగారు. చిరువ్యాపారులు, బిజెపి ఆందోళనలతో మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. డబ్బాల జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ ఆందోళనకారులు అధికారులను హెచ్చరించారు. బీజేపి పట్టణ అధ్య క్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ ఓబిసి >>2

---

# తాళం వేసిన ఇళ్లే వాళ్ల టార్గెట్

**తాండూరులో దొంగల ముఠా అరెస్టు**

**10 తులాల బంగారం, 150 తులాల వెండి, రూ.లక్ష నగదు స్వాధీనం**

**డిఎస్‌పి నర్సింగ్ యాదయ్య వెల్లడి**





వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

**తాండూరు, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా తాండూరులో వరుస దొంగతనాలకు ప్పాడుతున్న దొంగల మూఠాను పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుండి 10తులాల బంగారు, 150 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ. లక్ష నగదును స్వాధీనం చేసుకు న్నారు. మంగళవారం తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డిఎస్పీ నర్సింగ్ యాదయ్య, పట్టణ సీఐ పరమేశ్వర్ గౌడ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. మహబూబ్ నగర్ జిల్లా గండీడు మండలం లింగాయిపల్లికి చెందిన అదుల బాబు, వికారాబాద్ జిల్లా యాలాల మండలం కమాల్ పూర్‌కు చెందిన బోయిన శ్రీకాంత్‌లతో పాటు తాండూరు పట్టణం మార్కండేయ కాలనీకి చెందిన ట్రాక్టర్ మెకానిక్ ప్రవీణ్‌తో పరిచయం ఏర్పడింది. ఈ ముగ్గురు గత కొన్ని నెలలుగా తాండూరు ప్రాంతంలో తాళం వేసిన ఇండ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత ఏడాది నవంబరు నెలలో తాండూరు మున్సిపల్ పరిధి, యాలాల పోలీస్టేషన్ పరిధిలో ఉన్న రాజీవ్‌కాలనీలో ఓ ఇంటి తాళం పగలగొట్టి మూడు >>2

---

# గురుకులాల్లో భద్రతకు భరోసా ఏది?

**లైంగిక వేధింపుల ఆరోపణలపై బిఆర్ఎస్ నేతల విజిట్**

**అధికారుల తీరుపై మాజీ మంత్రి సబిత ఆగ్రహం**



చర్లపటేల్‌గూడ గురుకుల క్యాంపస్‌లో ఫిర్యాదులపై ఆరా తీస్తున్న సబితా ఇంద్రారెడ్డి తదితరులు

**రంగారెడ్డిఅర్బన్ , సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** చర్లపటేల్‌గూడలోని బీసీ, మైనారిటీ గురుకుల క్యాంపస్‌లో విద్యార్థులు, మహిళా సిబ్బంది భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మంగళవారం క్యాంపస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ శ్రీలతతో మాట్లాడి క్యాంపస్‌లో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇటీవల అందిన ఫిర్యాదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, మహిళా సిబ్బంది నుంచి సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తగిన స్థాయిలో స్పందించలేదని వారు >>2

---

# దేవుళ్లనీ రాజకీయాల్లోకి లాగుతారా!

**సిఎం వ్యాఖ్యలపై బిజెపి నేతల ఫైర్**

**దిష్టిబొమ్మ దహనానికి యత్నం**

**అడ్డుకున్న పోలీసులు**

**కోట్‌పల్లి, సెప్టెంబరు, 29 ప్రభాతవార్త;** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి శ్రీరాముడు, శివుడి గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో బీజెపి నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనాన్ని చేయడానికి ప్రయత్నించడంతో స్థానిక పోలీసులు ఆందోళనకారులను అడ్డుకున్నారు. దింతో పోలీసుల తీరును నిరసిస్తూ ఆందోళనకారులు రాస్తారోకో నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీరాముడు, శివుడి గురించి చేసిన వ్యాఖ్యలపై రాజకీయంగా వివాదం నెలకొంది. రాముడు ధనికులకు, శివుడు పేదలకు సంబంధించిన దేవుళ్లుగా ఆయన వ్యాఖ్యానించడంతో శివ భక్తులపై ఈ వ్యాఖ్యలు హిందూ సమాజంలో విభజనకు దారితీసేలా ఉన్నాయని బీజెపి నాయకులు ఆరోపించారు. శ్రీరాముడు, పరమశివుడు ఇద్దరూ హిందువుల ఆరాధ్య దైవాలని, దేవుళ్లను రాజకీయాలకు >>2

---

# బంగారు నగల కోసమే కిరాతకం

**పరిచయం పెంచుకుని పథకం ప్రకారం..**

**ఆటోడ్రైవర్ హత్యాచారం**

**వీడిన మంగమ్మ హత్య కేసు మిస్టరీ**

**ఇద్దరు నిందితుల అరెస్టు..**

**నందిగామ, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** ఎట్టకేలకు నందిగామలో దారుణ హత్యకు గురైన మంగమ్మ హత్య కేసును సీసీ ఫుటేజీ, ఫోన్ కాల్స్ ఆధారంగా పోలీసులు ఛేదించారు. ఇరువురి నిందితులను చాకచక్యంగా అరెస్ట్ చేశారు. ఈ వివరాలును ఫ్యూచర్ సిటీ డిసిపి శిరీష రాఘవేందర్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. హత్యకు గురైన మంగమ్మ 15 రోజుల క్రితం ఓ ఆటోలో ప్రయాణించింది. ఆటో డ్రైవర్ ఇస్లావత్ చంద్రబాబు ఆమె ఒంటిపై బంగారం నగలపై కన్నేశాడు. కాజేయటం కోసం ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. అప్పుడప్పుడు ఆమెను విలా సవంతమైన ప్రదేశాలకు తీసుకెళ్లేవాడు. పాతలావత్ మహేందర్‌తో కలిసి పథకం ప్రకారం.. ఈనెల 22న మధ్యాహ్నం సమయంలో మంగమ్మను షాద్‌నగర్ కల్లు కాంపౌండ్ వద్దకు రమ్మని.. అక్కడినుండి ఆటోలో కొత్తూరు తీసుకెళ్లారు. అక్కడ కల్లు సేవించి నందిగామ బైపాస్‌లో ఉన్న జెఎస్ ఆర్ వెంచర్ లోని నిర్జన ప్రదేశానికి వచ్చారు. మరోసారి మద్యం తాగి ఆమెపై అత్యాచారం చేశారు. ఎవరికైనా చెబుతుందన్న అనుమానంతో చంద్రబాబు బీరు సీసాతో ఆమె తలపై బాదగా.. మహేందర్ గొంతు నులిమి చంపినట్లు డిసిపి వెల్లడించారు. మంగమ వద్ద ఉన్న బంగారు నగలను >>2





వివరాలను వెల్లడిస్తున్న డిసిపి శిరీష రాఘవేందర్

---



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

# పెండింగ్ ఆడిట్ అభ్యంతరాలపై స్పందించండి

**-అదనపు కలెక్టర్ ఉమా శంకర ప్రసాద్**

**వికారాబాద్, ప్రభాతవార్త:** పెండింగ్ ఆడిట్ అభ్యంతరాలపై సమాధానాలను త్వరగా సమర్పించాలని అదనపు కలెక్టర్ ఉమా శంకర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆడిట్ అభ్యంతరాల పరిష్కారంపై జిల్లా స్థాయి కమిటీ (డీఎల్‌సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఆడిట్ అంశాలపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అవసరమైన చోట ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, ఒక నెలలోగా సాధ్యమైనన్ని అభ్యంతరాలను పరిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బకాయి ఉన్న (మార్కెట్ కమిటీ, దేవదాయాల) ఆడిట్ ఫీజును ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. పెండింగ్ ఆడిట్ అభ్యంతరాలపై సమాధానాలను త్వరగా సమర్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. నిధుల దుర్వినియోగం, తీవ్రమైన, ఆర్థికేతర అభ్యంతరాలకు ముందుగా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఆడిట్ అధికారి బి.శ్రీనివాస బాబు, జిల్లా పరిషత్ సీఈవో సుదీర్, డిపివో పి.జయసుధ తదితరులు పాల్గొన్నారు.

